# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 26-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రతి పౌరుడికీ సమర్థవంతమైన వైద్యం లభించేలా చూసే బాధ్యత అందరిపై ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.
- 21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ మలేషియాలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యూన్ తో సమావేశమయ్యారు.
- మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ బంగ్లాదేశ్ జట్ల మధ్య చివరి లీగ్ మ్యాచ్ జరుగుతోంది.
- ఆంధ్రప్రదేశ్ తీరానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది.

==================

ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రైవేట్ రంగ ఆరోగ్య సంరక్షణ సంస్థలు సహకారం ముఖ్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు తెలిపారు. ఘజియాబాద్‌లో రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ విస్తరణ ప్రయత్నాలలో ప్రభుత్వంతో పాటు అన్ని ఇతర సంస్థలూ కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతి పౌరుడికీ సమర్థవంతమైన వైద్యం లభించేలా చూసే బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు. వైద్య సంస్థలు సామాజిక బాధ్యతను కూడా నెరవేర్చడాన్ని తమ కర్తవ్యంగా భావించాలని రాష్ట్రపతి ఈ సందర్భంగా సూచించారు.

==================

ప్రపంచంలో అనిశ్చితి పరిస్థితులు ఉన్నప్పటికీ, భారత్- ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నిరంతర పురోగతిని సాధించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మలేషియాలో ఈ రోజు జరిగిన ఆసియాన్-ఇండియా శిఖరాగ్ర సమావేశంలో దృశ్యమాధ్యమం ద్వారా ప్రధానమంత్రి మాట్లాడుతూ... భారత్, ఆసియాన్ దేశాలు కలిసి ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు వుంటాయని తెలిపారు. 21వ శతాబ్దం భారత్, ఆసియాన్ దేశాల శతాబ్దమని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. భారత్- ఆసియాన్ బలమైన భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, అభివృద్ధికి పటిష్టమైన పునాదిగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. భారత్ అన్ని విపత్తుల సమయాల్లో ఆసియాన్ దేశాలకు అండగా నిలబడిందని ప్రధాని గుర్తు చేశారు. విపత్తు సహాయం, సముద్ర భద్రత వంటి రంగాలలో సహకారం వేగంగా పెరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరాన్ని `ఆసియాన్-ఇండియా సముద్ర సహకార సంవత్సరంగా` నరేంద్ర మోదీ ప్రకటించారు.

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

ఛట్ పూజ సంస్కృతి, ప్రకృతి, సమాజ ఐక్యతకు అద్దం పడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. 'మన్ కీ బాత్' 127వ సంచికలో ప్రధానమంత్రి ఈరోజు దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఛట్ పూజ సందర్భంగా ప్రజలందరికీ ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' ప్రతి భారతీయుడిని గర్వంతో నింపిందని ప్రశంసించారు. ఒకప్పుడు మావోయిస్టుల ప్రభావంతో భయం ఉండే ప్రాంతాల్లో ఇప్పుడు ప్రజలు సంతోషంగా వున్నారన్నారు. వంట నూనెల వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని తాను గతంలో రాసిన లేఖకు ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఒడిశాలోని కోరాపుట్ కాఫీ అద్భుతమైన రుచిని కలిగి ఉందని, దీని సాగు వల్ల ఆ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని ప్రధానమంత్రి తెలిపారు. పండుగ రోజుల్లో `జీఎస్టీ బచత్ ఉత్సవ్` పట్ల ప్రజల్లో ఉత్సాహం కనిపించడం సంతోషకరమన్నారు. అలాగే, పండుగల వేళ స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పెరగడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ సామాజిక కార్యకర్త బైకుంఠభాయ్ మెహతా జయంతి సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనను స్మరించుకున్నారు. బైకుంఠభాయ్ మెహతాకు నివాళులర్పిస్తూ కేంద్రమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు ఒక పోస్టు చేశారు. బైకుంఠభాయ్ మెహతా దేశంలోని సహకార ఉద్యమ కీలక పితామహుల్లో ఒకరని అమిత్ షా కొనియాడారు. సహకార బ్యాంకులు, వ్యవసాయ సహకార సంఘాలు, వినియోగదారుల సహకార సంస్థల పునాదులను బలోపేతం చేయడంలో మెహతా కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశ సహకార రంగానికి ఆయన చేసిన సేవలు ఎంతో విలువైనవని అమిత్ షా తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

ఆసియాన్ కూటమి సమావేశాల సందర్భంగా భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ మలేషియాలో దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యూన్ తో ఈ రోజు సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై వారు చర్చించారు. ఈ సమావేశం గురించి డాక్టర్ జైశంకర్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. భారత్-దక్షిణ కొరియా మధ్య ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, రక్షణ, నౌకానిర్మాణ రంగాలలో సహకారాన్ని పెంచే అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని మంత్రి జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించిన భారత జట్టు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఈరోజు బంగ్లాదేశ్‌తో తలపడుతోంది. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. వర్షం అంతరాయం కలిగించడంతో ఈ మ్యాచ్‌ను 27 ఓవర్లకు కుదించారు. 17 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి బంగ్లాదేశ్ 54 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = =

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఆంధ్రప్రదేశ్ తీరానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ విభాగం (IMD) హెచ్చరించింది. ఈ తీవ్ర వాయుగుండం తుపానుగా, ఆ తర్వాత తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని, అక్టోబర్ 28వ తేదీ నాటికి ఈ తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ అమిత్ బరద్వాజ్ పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ రేపటి నుంచి రెండు రోజుల పాటు బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో పర్యటించనున్నారు. భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (FTA) చర్చలను వేగవంతం చేసే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = =